బిఆర్ఎస్‌ను ప్రజలు బంగాళాఖాతంలో కలిపారు

- గత ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ భూములు కబ్జా చేశారు
- అక్రమాలను సాక్ష్యాధారాలతో వెల్లడిస్తాం
- 28 నుంచి జనవరి 6 వరకు గ్రామ, వార్డు సభలు
- ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరణ
- కలెక్టర్ల సదస్సులో వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూముల లావాదేవీలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి అక్రమాలకు తావులేకుండా పారదర్శక విధానాన్ని తీసుకొస్తామని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ భూములు కబ్జాచేసి రెగ్యులరైజ్ చేసుకున్నారని, మరికొన్ని లావాదేవీలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటికి సంబంధించి పూర్తి సమాచారంతోపాటు సాక్ష్యాధారాలను వెల్లడిస్తామనీ తెలిపారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని పొంగులేటి వెల్లడించారు. ధరణి వద్దంటున్న కాంగ్రెస్‌ను

బంగాళాఖాతంలో కలపాలని తాజా మాజీ సిఎం ప్రజలను రెచ్చగొట్టినా... విజ్ఞత కలిగిన ప్రజలు బిఆర్ఎస్ పార్టీనే బంగాళాఖాతంలో కలిపారని పొంగులేటి అన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత తొలిసారిగా జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఆదివారం డా.బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశ వివరాలను మంత్రి మీడియాకు వివరించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేద్దామని సిఎం పిలుపునిచ్చారని పొంగులేటి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే అధికారులకు ఆయా పథకాల్లో కష్టనష్టాలు అర్థమవుతాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సిఎం కోరినట్లు తెలిపారు. అధికారులపై తమకు పూర్తి నమ్మకం ఉందనీ, ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనిచేయాలని సూచించినట్లు చెప్పారు. డ్రగ్స్, నకిలీ విత్తన విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు,ఎస్పిలకు సిఎం స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తామని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. అందుకు తగిన కార్యచరణ తయారవుతోందని చెప్పారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి ఈనెల 28 నుంచి జనవరి 6వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గ్రామసభలకు ఒక రోజు ముందుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు దరఖాస్తులు అందజేస్తామన్నారు. ఇందిరమ్మ పాలనలో అధికారులే ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకుంటారన్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన తర్వాత వారు ఏ పథకానికి అర్హులో అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. ఎటువంటి వివక్ష, కక్షసాధింపు చర్యలు ఉండవని పొంగులేటి మరోసారి స్పష్టంచేశారు. గ్రామసభలకు వచ్చే వారు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను సిఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. గ్రామసభల నిర్వహణకు కావాల్సిన నిధులను సిఎం విడుదల చేశారన్నారు. గతంలో కలెక్టర్ల సదస్సు అంటే కేవలం సీఎం చెప్పింది అధికారులు విని వెళ్లిపోయే వాళ్లు. కానీ, ఇందిరమ్మ ప్రభుత్వంలో అలా జరగదన్నారు. ప్రభుత్వ పనితీరుపై కలెక్టర్లు, ఎస్పీల అభిప్రాయాలు తెలుసుకున్నామనీ, అధికారులు కూడా నిర్భయంగా వారి దృష్టికి వచ్చిన అంశాలను వెల్లడించారని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరి పథకాల్లో కోత పెట్టమన్నారు. సమావేశంలో సిఎస్ శాంతికుమారి, పాల్గొన్నారు.

రవాణా శాఖ కమిషనర్‌గా జ్యోతి బుద్ధ ప్రకాశ్

- పలువురు ఐఎఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ బదిలీలకు సంబంధించి సిఎస్ శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సీనియర్ ఐఎఎస్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ ను రవాణా శాఖ కమిషనర్‌గా, ఇ శ్రీధర్‌ను ఎక్సైజ్ శాఖ కమిషనర్‌గా నియమించింది. మేడ్చల్ మల్కాగిజిరి కలెక్టర్ గౌతం పొట్రుకు రంగారెడ్డి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. రంగారెడ్డి కలెక్టర్ భారతి హోళికేరిని జిఎడిలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. జిహెచ్ఎంసి అదనపు కమిషనర్‌గా ఉన్న శృతి ఓజాను ఇంటర్ విద్య డైరెక్టర్.. ఇంటర్ బోర్డు కార్యదర్శిగా బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఐఎఎస్ ఇవి నరసింహారెడ్డిని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఐపిఎస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్ ను సివిల్ సప్లైస్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది.

క్షమ, ప్రేమకు మించిన గుణంలేదు

- ఏసును స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలి
- మంత్రి సి దామోదర్ రాజనర్సింహా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షమ, ప్రేమకు మించిన గుణం లేదనే గొప్ప సందేశాన్ని.. ఏసు ప్రభువు 2వేల ఏళ్ల క్రితం తన త్యాగం ద్వారా చెప్పారని వైద్యారోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్‌లను ఆదివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ధర్మాన్ని కాపాడేందుకు ఏసు ప్రభువు లాగా మన పాత్ర ఉండాలన్నారు. సమాజంలో గెలుపు, ఓటములు నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రసంగాలు వినడానికి గొప్పగా ఉన్నప్పటికీ.. వాటి ఆచరణ చాలా కష్టంగా ఉంటుందన్నారు. అనంతరం చర్చి ఫాదర్‌లతో కలిసి కేక్‌ను కట్ చేసారు. చర్చి ఫాదర్‌లు మాణిక్యం, విజయ్‌తో పాటు పలువురు మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం అందోలు నియోజకవర్గంలోని అందోల్, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి, టేక్మాల్ మండలాలకు చెందిన క్రైస్తవ సోదర, సోదరీమణులకు గిఫ్ట్ ప్యాక్‌లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, జడ్పీటీసీ సరోజ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రతిభకు గుర్తింపు అవసరం

- జస్టిస్ శ్రీసుధ

ప్రజాశక్తి కల్చరల్

ప్రతి వ్యక్తీ తన ప్రతిభకు తగిన గుర్తింపు కోరుకుంటారని సాంస్కృతిక సంస్థలు అట్టి వారిని సత్కరించటం మంచి సంప్రదాయము అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై లలిత కళా స్రవంతి 21 వ వార్షికోత్సవం నృత్య భరితం గా జరిగాయి. శ్రీ వారి పాదాలు నాట్య సంస్థ రమాదేవి శిష్య బృందం పద్మావతి కూచిపూడి నాట్య లయ సంస్థ పద్మావతి శిష్య బృందం చే కూచిపూడి భరత నాట్య అంశాలు ఆకట్టుకున్నాయి అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ శ్రీ సుధ తెలుగు టీ.వీ.చానల్స్ లోని రిపోర్టర్స్ కు వ్యాఖ్యాతలకు ప్రతిభా పురస్కారాలు బహుకరించారు. వీరిలో జీ సునీల్(10 టీ వీ)సౌజన్య(ఎన్ టీ వీ) ఉదయ శ్రీ(టీ.న్యూస్)అరుణ (10 టీ వీ) శ్రీదేవి(భారత్ టూ డే) తదితరులు వున్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతం లో వెండి తెర కు ప్రాధాన్యత వుండేది అనీ నేడు బుల్లి తెర కున్న అదరణ పెరిగిందని వివ రించారు సంస్థ స్థాపకుడు గొర్తి దీక్షితులు స్వాగతం పలుకగా విశ్వేశ్వర రావు,, శైలజ పురస్కార బహుకరణ లో పాలు పంచుకొన్నారు.

పెరియార్ స్ఫూర్తితో సామాజికోద్యమాలు

- కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వేల ఏళ్లుగా దేశంలో కొనసాగుతున్న అన్ని రకాల ఆధిపత్యాలను అంతం చేయడమే భారత సామాజిక ఉద్యమ పితామహుడు పెరియార్ రామస్వామికి అర్పించే నిజమైన నివాళని పలువురు వక్తలు తెలిపారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పెరియార్ రామస్వామి నాయకర్ 50వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎస్‌వికె ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్, టిపిఎస్‌కె రాష్ట్ర కన్వీనర్ జి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు మాట్లాడారు. పెరియార్ స్ఫూర్తితోనే భౌతిక వాద దృక్పథం దక్షిణ భారతదేశమంతటా వ్యాపించిందన్నారు. విగ్రహారాధన, దేవుడు, మూఢనమ్మకాలు, బ్రాహ్మణాధిపత్యంపై ఆనాడే ఆయన తిరుగుబాటు బావుట ఎగరేశారని గుర్తు చేశారు. వేదాలను బ్రాహ్మణిజాన్ని ప్రశ్నించడం ద్వారా ప్రజలు చైతన్యవంతులు కావాలని, ప్రతి దాన్ని పాదార్థికంగా పరిశీలించడం నేర్చుకోవాలని సూచించారన్నారు. రష్యాకెళ్లొచీ అక్కడి కమ్యూనిజం భావాజాలాన్ని వంటపట్టించుకున్నారని వివరించారు. ప్రశ్నించడం నేరమైతే ఆ నేరాన్ని పదేపదే చేస్తానని ఆయన చెప్పడంగొప్ప విషయమని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐత విజయ్, సోషల్ మీడియా ఇంచార్జి జగదీష్, టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, టిటెన్‌సిఇఒ సుందర్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ బాల పీరు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్టులో ఇరుక్కుపోయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్‌లోని ఓ ప్రయివేటు కార్యక్రమానికి ఆదివారం వెళ్లిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అపార్టుమెంట్ లిఫ్టులో ఇరుక్కుపోయారు. పై అంతస్తు వెళ్లేందుకు లిఫ్టు ఎక్కగా ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్టు మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో లోపల ఉన్న ఎమ్మెల్యేతో సహా మిగిలిన వారు ఆందోళనకు గురయ్యారు. సాంకేతిక సిబ్బంది వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భద్రతాసిబ్బంది లిఫ్టు డోర్లు బద్దలుకొట్టి లోపల ఉన్నవారిని సురక్షితంగా బైటకు తీసుకొచ్చారు.

తెలుగు భాషా సంస్కృతిని దేశం విడిచినా మరువరాదు

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాశక్తి - కల్చరల్

వృత్తి ఉద్యోగాల రీత్యా తెలుగువారు దేశం విడిచి వెళ్లి విదేశాలలో స్థిరపడ్డా మాతృ భాషా సంస్కృతులు మరువరాదు అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై తెలంగాణ అమెరికా తెలుగు సంఘం(టీ టీ ఏ) సాంస్కృతిక వేడుకల సం రంభం లో ముఖ్య అతిథిగా బండారు దత్తాత్రేయ పాల్గొని మాట్లాడారు. మన రాష్ట్రంలో వున్న తెలుగువారు విదేశీ మోజు లో వుంటే అక్కడి తెలుగువారు మన కళలను నేర్చుకొంటూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని అభినందించారు వేడుకల కో ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథ్ కార్యక్రమం పర్యవేక్షణ చేయగా అధ్యక్షుడు వంశీ రెడ్డి స్వాగతం పలికారు.ప్రెసిడెంట్ ఎలక్ట్ నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొనగాకార్యదర్శి కవిత రెడ్డి నివేదిక సమర్పించారు అనంతరం సినీ పాటల విభావరి నృత్య ప్రదర్శనలు కట్టుకున్నయి.

ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి

- ఫార్మసిస్టుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్, జూనియర్ క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు ఫార్మసిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ధర్నాలో తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు ఆకుల సంజయ్ రెడ్డితో పాటు తేజ, శివకుమార్, కొలిపాక బాలరాజు, మాడెం ప్రభాకర్, కన్నెబోయిన శ్రీనివాస్, కంభంపాటి శ్రీకాంత్, ఏం.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, ఫార్మసిస్టుల సంతకాలు వెరిఫై చేయాలని కోరారు. కౌన్సిల్ 29,594 ఓట్లు మాత్రమే చూపిస్తున్నదనీ, మిగతా 23,406 ఓట్లు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కౌన్సిల్ నుంచి కోటి రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 20 వేల పోస్టల్ బ్యాలెట్ లో 6,500 తిరస్కరించడానికి గల కారణాలు ఏమిటి.? అని ప్రశ్నించారు. రిజిస్ట్రార్ యోగానందం, జూనియర్ క్లర్క్ గోపి, కార్యాలయ సిబ్బంది అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. సిఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీ కమీషన్ వేయాలని కోరారు.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో ధర్నా చేస్తున్న ఫార్మసిస్టులు

కెసిఆర్ ఉద్యమకారుడు కాదు... విధ్వంసకారుడు

- అన్ని వ్యవస్థలనూ ఆగం చేశారు : మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి
- టైటిల్ గ్యారంటీ తేవాలి.. గ్రామంలోనే సమస్యలు పరిష్కారం కావాలి : భూమి సునీల్
- అధికారుల కోసం కాదు..పేదల కోసం పనిచేయండి : ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ ఉద్యమకారుడు కాదని, ఆయన తెలంగాణ విధ్వంసకారుడని విశ్రాంత ఐఎఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, విద్యా, రెవెన్యూ, పంచాయతీరాజ్, టిఎస్‌పిఎస్సి, ఇలా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పరిపాలన ఎలా చేయకూడదో అలా చేసిచూపాడన్నారు. కలెక్టర్లను రియల్టర్లుగా మార్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజాలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ) ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ బలోపేతం అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. అత్యధిక అవినీతికి పాల్పడే అధికారులను తీసుకొచ్చి హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాల్లో పోస్టింగులు ఇచ్చి దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యేలు సైతం దొంగలుగా మారి దోచుకున్నారని విమర్శించారు. రెవెన్యూ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేసి వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేసి భూరికార్డులను ఆగం చేసి దోచుకోవాల్సినంత భూమిని గత పాలకులు దోచుకున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలతో సంపాధించిన డబ్బుతో దేశాన్నే కొనేయాలని కలలు కన్నారని విమర్శించారు. గ్రామ స్థాయిలోనే రైతుకు అన్ని రకాల సేవలను అందించాలన్నారు. ఇందుకోసం పటిష్ఠమైన గ్రామ పాలనా వ్యవస్థను

తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మన రాష్ట్రాన్ని మనమే రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త దొంగలు తయారవ్వకుండా చూసుకోవాలని సూచించారు.

టిజెఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ..న్యాయాన్ని పక్కన పెట్టి, సొంత అవసరాల కోసం చట్టాలను తయారు చేస్తే ఎలా ఉంటుందనే దానికి ధరణి పోర్టలే మంచి ఉదహరణ అని చెప్పారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తన సొంతానికే రెవెన్యూ చట్టంలో మార్పులు తెచ్చారని ఆరోపించారు. చివరకు భూ రికార్డులను సైతం విధ్వంసం చేశారన్నారు. కేవలం వారికి మాత్రమే కావాల్సినవి రాసుకున్నారని ఆరోపించారు. మిగతా జరిగిన తప్పులకు రెవెన్యూ వారికి శిక్షలు విధించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. విఆర్ఎల నుంచి కనీసం అభిప్రాయం కూడా తీసుకోకుండా రెవెన్యూకు దూరం చేశారన్నారు. అధికారులు పాలకుల కోసం కాకుండా ప్రజల కోసం పని చేయాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ నిపుణులు, న్యాయవాది భూమి సునీల్ రాష్ట్రంలో ప్రధానమైన భూ సమస్యకు పరిష్కారం చూపకుండా బంగారు తెలంగాణ, ఆకుపచ్చ తెలంగాణ..ఏ తెలంగాణా సాధ్యం కాదని నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగానూ భూ సమస్య పరిష్కారమైన దేశాలే అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. భూ పరిపాలన గ్రామ స్థాయిలో ఉండాలనీ, రైతు సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా వ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. భూమి హద్దులు స్పష్టంగా ఉండాలని, హక్కుల కల్పించే పత్రాలు పక్కాగా, హక్కుల మార్పిడి వెంటనే జరిగేలా ఉండాలని సూచించారు. భూమి హక్కులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వాలన్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్ కాదు.. హక్కులకు రిజిస్ట్రేషన్ కావాలన్నారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25వేల జూనియర్ అసిస్టెంట్ల నియామకంతో గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లాలు పెరిగినప్పటికీ ఉద్యోగుల సంఖ్య పెరగలేదన్నారు. ఇతర విభాగాలకు బదిలీ చేసిన విఆర్ఒ, విఆర్ఎలను అదే హోదాలో రెవెన్యూ శాఖకు రప్పించి గ్రామ స్థాయిలో పాలనను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ జానయ్య, డిప్యూటీ కలెక్టర్ల సంఘం నేతలు రమేష్ రాథోడ్, కె రామకృష్ణ, ఎన్ఆర్ సరిత, టిజిటిఎ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి ఎస్‌పిఆర్ మల్లేష్‌కుమార్, నేతలు ఉమాశంకర్, పూల్‌సింగ్, రమేష్ పాక, ఆరేటి రాజేశ్వర్, రాధ, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడారు.

గుండెపోటుతో యువ రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండెపోటుతో యువరైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంత్రి కనకయ్య(29) శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌కు వ్యవసాయ పనిమీద వెళ్లి తిరిగి వస్తున్నాడు. గొడుగుపల్లి గ్రామంలోనే గుండెపోటుతో బాధపడుతూ ద్విచక్ర వాహనం మీద నుండి కుప్పకూలాడు. వెంటనే కనకయ్యను 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేస్తుండగానే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సంధ్య, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

గిగ్ వర్కర్ల సంక్షేమంపై సిఎం హామీలను స్వాగతిస్తున్నాం

- ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ల నాయకులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిగ్ వర్కర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను స్వాగతిస్తున్నామని తెలంగాణ పబ్లిక్, ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్-సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వీరయ్య, పి శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓలా, ఊబర్, స్విగ్గీ, జొమాటో లాంటి ఆన్‌లైన్ యాప్ ద్వారా పనిచేసే డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్స్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, ఆరోగ్య శ్రీద్వారా రూ.10 లక్షల వైద్య సహాయం అందించేందుకు ప్రత్యేక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడుతామనీ, ప్రభుత్వం ద్వారానే ఆన్‌లైన్ యాప్ తీసుకొచ్చి వారికి ఉపాధి కల్పిస్తామని హామీనివ్వడం శుభపరిణామం అని పేర్కొన్నారు. 20 లక్షల మంది కార్మికులు రవాణారంగంపై ఆధారపడి పనిచేస్తున్నారనీ, వారంతా సరైన ఉద్యోగాల్లేక ఉపాధి కోసం ఆ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలనీ, గ్రిగ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో,క్యాబ్ డ్రైవర్లకు ఉపాధి తగ్గిపోయిందనీ, గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్టుగా వారికీ నెలవారీ జీవనభృతి అందించాలని విన్నవించారు. ఇన్సూరెన్స్, వాహనాల ఫిటినెస్, రోడ్ టాక్స్‌లను ప్రభుత్వమే భరించాలిలని కోరారు. ఈఎంఐపై మూడు నెలల పాటు మారిటోరియం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌పోర్టు యూనియన్ల నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నపూర్ణను ఆదుకున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాదర్బార్‌లో నాలుగు సార్లు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన అన్నపూర్ణ అనే మహిళను మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదుకున్నారు. తన ఆర్థిక కష్టాలను, తన పిల్లల చదువుల ఇబ్బందులను, తన దుర్భరమైన జీవితాన్ని వివరిస్తూ తమను ఆదుకోవాలని ఆమె ప్రజాదర్బార్‌లో కోరారు. అయితే ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్‌ను కలవడంతో ఆమె కుమార్తె నర్సింగ్ చదువుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కెటిఆర్‌కు అన్నపూర్ణ ధన్యవాదాలు తెలిపారు.

యేసు బోధనలు ఎప్పటికీ అనుసరణీయమే...

- క్రిస్మస్ సందర్భంగా సిఎం రేవంత్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యేసు ప్రభువు బోధనలు ఆయన చూపిన శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ అనుసరణీయమని సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని క్రైస్తవులకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శకంగా, ప్రజాస్వామికంగా సాగుతుందని పేర్కొన్నారు. క్రిష్టియన్ సోదరులు సంతోషంతో, ఆనందోత్స హాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలని, క్రీస్తు మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం అందరు పాటుపడాలని సూచించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు కెసిఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

యేసు క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆకాంక్షించారు. శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు ఇంచార్జి మంత్రులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి – కరీంనగర్, దామోదర రాజనరసింహ – మహబుబ్ నగర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి–ఖమ్మం, దుద్దిళ్ల శ్రీధర్ బాబు– రంగారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి– వరంగల్, పొన్నం ప్రభాకర్–హైదరాబాద్, కొండా సురేఖ –మెదక్, సీతక్క–ఆదిలాబాద్, తుమ్మల నాగేశ్వర్‌రావు–నల్గొండ, జూపల్లి కృష్ణారావు –నిజామాబాద్. ఉమ్మడి జిల్లాల పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వీరు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE AT BHONGIR
EA NO 1 OF 2021 & EA NO 2 OF 2021 IN EP NO 39 OF 2016 IN OS NO 143 OF 2006

BETWEEN:
M/s Narne Estates Pvt Ltd ...DECREE HOLDER
AND
Misala Ranga Rao (died) per LRs
...RESPONDENTS/PROPOSED JDR No's 2 TO 5
Respondents No 2 to 5 / Proposed JDR Nos 2 to 5
2. M Laxmamma, w/o late Misala Ranga Rao, Aged about 68 years, occ: Housewife
3. M Bhaskar, s/o late Misala Ranga Rao, Aged about 45 years, occ: Agriculture
4. M Tilak, s/o late Misala Ranga Rao, Aged about 42 years, occ: Agriculture.
5. M Bujji, d/o late Misala Ranga Rao, Aged about 41 years, occ: Housewife
All are R/o Padamati Somaram Village, Bibinagar Mandal Yadadri-Bhuvanagiri District

The above named Decree Holder has filed the above EAs 1/2021 & 2/2021 against you for condonation of delay and bringing on record as LRs of JDR No 1 in above EP. You are the Respondents No 2 to 5 / proposed JDRs No 2 to 5 in the EAs and you all are hereby directed to appear before the Hon'ble Addl Junior Civil Judge at Bhongir on 29-12-2023 at 10:30 am either in person or through an Advocate, failing which the matter will be decided in accordance with Law.

BY ORDER OF THE COURT
V V L Sujatha
-Advocate
Ph: 9440412044

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMMER DISPUTES REDRESSAL COMISSION AT: HYDERABAD
F.A.NO. 588 OF 2023

BETWEEN:
Sri.Pulimamidi Varrae Peer Kumar ...Petitioner/Appellant
And
M/s.Radha Krishna Automobiles PVt Ltd &others ...Respondents/Opp.parties

To,
1 .M/s.Radha Krishna Automobiles PVt Ltd, Situated at Plot No.A-5, ward no.7, Block No.2, Sanathnagar Main Road,Hyderabad-18. Rep.by its Managing Director and CEO M.V.Srinivas.
2. M.V.Srinivas ,Managing Director and C.E.O of M/s.Radha Krishna Automobiles Pvt Ltd, Occ:Business, R/o 5-10, Beside A.P.Seeds Crporation,Prasadampadu National Highway No.5,Vijayawada, Krishna District, Andhra Pradesh-521108.
3. M/s Toyota Kirloskar Motor Pvt Ltd, No.24,10 th Floor,Canberra Block,Vittal Mallya Road,Bangalore,Karnataka-560001,rep.by its M.D & C.E.O Masakazu Yoshimura
...Respondents/Opp.parties, (1,2,4)

Please take notice that the above named Appellant/Petitioner filed the above F.A against you. As the summons in the above case were returned un served for you at the above mentioned address, the Hon'ble State consumer disputes Redressal commission ordered this Publication as substitute of service to the summons. Hence you are here by informed that the F.A stands posted to 02-02-2024 for your appearance and to file counters if any. In case you fail to attend before the above court on 02-02-2024 at 10-30 A.M., you may set ex-party and the matter will be decided on merits.

(BY ORDER OF COURT)
B.Narsimhulu, Advocate
H.No.7-01-309/42,B.K.Guda,S.R.Nagar, Hyderabad. Cell No.9399915369

అదో అబద్ధాల పుట్ట.. తప్పుల తడక...

- అంకెల గారడీలు.. అభాండాలు...
- కాంగ్రెస్ శ్వేతపత్రంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- అసెంబ్లీ సాక్షిగా అప్పులపై ప్రభుత్వం అసత్యాలు చెప్పిందంటూ విమర్శ
- తమ హయాంలో తీసుకున్న స్థూల రుణాలు రూ.3,17,015 కోట్లేనని స్పష్టీకరణ
- బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రగతి ప్రస్థానంపై 'స్వేదపత్రం' విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం ఒక అబద్ధాల పుట్టని, తప్పుల తడకని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ విమర్శించారు. తమ పార్టీని, గత ప్రభుత్వాన్నీ బద్నాం చేసేందుకే కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా అప్పులపై అసత్యాలను వల్లె వేసిందని ఆయన విమర్శించారు. తమ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న స్థూల రుణాలు రూ.3,17,015 కోట్లేనని చెప్పారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్ర అప్పులు రూ.6.71,757 కోట్లుగా చూపించారని ఆయన తెలిపారు. విద్యుత్, ఆర్‌టిసి, పౌర సరఫరాల శాఖల్లో లేని అప్పులు ఉన్నట్టుగా చూపించారని వాపోయారు. తమ హయాంలో పెట్టిన ఖర్చు కంటే పెరిగిన సంపద పది రెట్లు ఎక్కువని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని గుర్తించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత లెక్కలు, అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో 'స్వేదపత్రం' అనే డాక్యుమెంట్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన ఆయన...తొమ్మిదన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనలో వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగు నీరు, అడవుల సంరక్షణ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి తదితరాంశాల్లో చేపట్టిన సంస్కరణలను ఏకరువు పెట్టారు. పెద్ద నోట్ల రద్దు, కరోనా మహమ్మారి, విభజన కష్టాల వల్ల రాష్ట్రం నష్టపోయిన తీరు గురించి చెప్పారు. తమ ఏలుబడిలో రెండో హరిత విప్లవం (వ్యవసాయం), గులాబీ (గొర్రెలు, ఇతర జీవాలు), నీలి (చేపలు), శ్వేత (పాలు), పసుపు విప్లవా (ఆయిల్ ఫామ్)లను సాధించామని తెలిపారు.

బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆస్తులను పెంచటం తోపాటు అస్థిత్వాన్ని సైతం కాపాడామని కెటిఆర్ ఈ సందర్భంగా చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టుల్లో చాలా వాటిని పూర్తి చేశామని తెలిపారు. వాటికి ఇప్పుడు కాల్వలు తవ్వి, నీళ్లు ఇవ్వాలంటూ ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులో ఒక బ్యారేజీలో చిన్న తప్పు దొర్లితే మొత్తం ప్రాజెక్టునే లోపభూయిష్టంగా పేర్కొనటం శోచనీయమన్నారు. రైతుల సహజ మరణాలను సైతం అన్నదాతల ఆత్మహత్యలుగా చిత్రీకరించటం కాంగ్రెస్ సర్కారుకే చెల్లిందని విమర్శించారు. ఉచిత కరెంటు, భూ గర్భ జలాలు పెరగటం తదితర వెసులుబాట్ల వల్ల వ్యవసాయ మోటార సంఖ్య బాగా పెరిగిందని చెప్పారు. దీనిపైనా సిఎం రేవంత్ వ్యగ్యంగా మాట్లాడడం దారుణమన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. దాన్ని ఖర్చుగా చూడకూడదని, భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా భావించాలని అన్నారు. తెలంగాణ సంపదను అగౌరవపరిస్తే సహించబోమన్నారు. 'అది ఒక దీపస్తంభం లాంటిది, దాన్ని ఆరిపోనివ్వం.. ఆగిపోనివ్వం..నిలబెడతాం...'అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులపై న్యాయ విచారణకు ఆదేశిస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది.. మేం ఎలాంటి విచారణకైనా సిద్ధం... అని కెటిఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

చెప్పుకోలేక పోయాం...

అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ వైపు నుంచి కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని కెటిఆర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు, అత్యధిక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితరాంశాలను సరిగ్గా చెప్పుకోలేక పోయామని అన్నారు. ప్రతీ ఎన్నికల్లోనూ గెలుపోటములు సహజమేనని తెలిపారు. ప్రస్తుత ఓటమి తమ పార్టీకి స్పీడ్ బ్రేకర్ లాంటిదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇంకా 412 హామీలను అమలు చేయాల్సి ఉందన్నారు. అందువల్ల వాటన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు.

స్వేదపత్రంలోని ముఖ్యాంశాలు... తలసరి ఆదాయం (రూ.)

2013-14	2022-23
1,12,162	3,17,115
జిఎస్‌డిపి (లక్షల కోట్లు)	
2013-14	2022-23
4.51	13.27
పేదరికం	
2013-14	2022-23
21.92	5.8

1.బడ్జెట్ అప్పులు (రూ.కోట్లలో)3,89,673
2.పాత బడ్జెట్ రుణాలు (రూ.కోట్లలో)72,658
3.స్థూలంగా బడ్జెట్ రుణాలు (రూ.కోట్లలో)3,17,015 (6,71,757 కాదు)
4.ఎస్‌పీవీలు (ప్రభుత్వ గ్యారెంటీలు ఉన్నవి రూ.కోట్లలో)1,27,208
5.ఎస్‌పీవీలు (రూ.కోట్లలో)95,462
6.ప్రభుత్వ హామీలేని రుణాలు (రూ.కోట్లలో) 59,414
7.పౌర సరఫరాల శాఖ లోన్లు రూ.21,029 కోట్లు మాత్రమే (వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.56,146 కోట్లుగా చూపింది-లేని రూ.35 వేల కోట్లను అదనంగా చూపించారు)
8.తమ పరపతితో కట్టుకునే బడ్జెటేతర అప్పు స్థూలంగా రూ.2,46,969 కోట్లు
9.ఆర్టీసీ, విద్యుత్, పౌర సరఫరాలశాఖలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపారు

విద్యుత్ రంగం

1. ఈ రంగంపై పెట్టిన ఖర్చు రూ.1,37,517 కోట్లు
2.స్థాపించిన విద్యుత్ సామర్థ్యం 2013-14లో 7,778 మెగావాట్లు, 2022-223 నాటికి అది 19,464 మెగావాట్లకు పెరిగింది
3.తలసరి విద్యుత్ వినియోగం 2013-14లో 1,196 యూనిట్లుగా ఉంది. 2022-23 నాటికి అది 2,140 యూనిట్లకు పెరిగింది.
4.రాష్ట్ర పీక్ డిమాండ్ 2013-14లో 5,661 మెగావాట్లు, 2022-23 నాటికి అది 15,497 మెగావాట్లకు పెరిగింది.
5.మోటారు కనెక్షన్లు 2013-14లో 19 లక్షలుగా ఉంటే, 2022-23 నాటికి వాటి సంఖ్య 28 లక్షలకు పెరిగింది.

వ్యవసాయ రంగం...

1.ఉచిత విద్యుత్ కోసం రూ.36,899 కోట్లు ఖర్చు
2.మొత్తం 58.29 లక్షల మందికి రూ.30 వేల కోట్ల మేర రుణాల మాఫీ
3.రైతు బీమా కోసం రూ.6,861 కోట్ల ప్రీమియం చెల్లింపు
4.తొమ్మిదేండ్లలో రూ.1,34,768 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్ల (723 లక్షల మెట్రిక్ టన్నులు)

ఆరు గ్యారంటీల అమలు ఇప్పట్లో అసాధ్యం

- పార్లమెంట్‌లో దాడి భద్రతాలోపమే
- పార్టీ ఆదేశిస్తే నా కుమారుడు అమిత్ పోటీ
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇప్పట్లో అమలు సాధ్యం కాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అదేశిస్తే నల్లగొండ లేదా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పోటీ చేస్తారని తెలిపారు. తెలంగాణలో నాలుగు జిల్లాల్లో మాత్రమే కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. మిగతా జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో బిఆర్ఎస్ ఆధిపత్యం కనిపించిందన్నారు. ముఖ్యమంత్రిగా కెసిఆరే ఉండాలని ప్రజలంతా అనుకున్నారని, కానీ ఎమ్మెల్యేలు ఓడిపోవడం వల్ల ఫలితం తారుమారైందని తెలిపారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కొత్తగా వచ్చిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని, తన వంతుగా ప్రాజెక్టులపై సూచనలు, సలహాలు అందించానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ప్రొటోకాల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. బిఆర్ఎస్ తెలంగాణలో సృష్టించిన ఆస్తుల మీద శ్వేతపత్రం విడుదల చేస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో పొగ బాంబ్ దాడి భద్రతా లోపాలను స్పష్టంగా చూపిస్తుందన్నారు. ప్రభుత్వాలు రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం పని చేయాలి కానీ పట్టుదలకు పోయి చతికలపడొద్దని సూచించారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు తృటిలో తప్పిన ముప్పు

- బస్సు నుండి విడిపోయిన వెనుక చక్రాలు
- ఓవర్‌లోడ్ కాదన్న ఆర్‌టిసి ఎమేడి సజ్జనార్
- ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హుజురాబాద్ నుంచి హన్మకొండ వెళ్తున్న పల్లె వెలుగు ఆర్‌టిసి బస్సు వెనుక టైర్లు ఒక్కసారిగా ఊడిపోయి సమీపంలోని పొలాల్లోకి చక్రాలు దూసుకెళ్లాయి. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఎల్కతుర్తి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణికులకూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి ప్రయాణీకులతో బయలుదేరిన ఆర్‌టిసి బస్సు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలోకి చేరుకోగానే పెద్ద శబ్దంతో వెనుకటైర్లు బస్సు నుంచి ఊడిపోయాయి. దాంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్.. బస్సును కంట్రోల్ చేసి ఓ పక్కకు ఆపారు. దాంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 80 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. 55 మంది వెళ్లాల్సిన ఈ బస్సులో అంతమందిని ఎక్కించుకోవడం గమనార్హం. ఈ ప్రమాదంపై ఆర్‌టిసి ఎండి సజ్జనార్ మాట్లాడుతూ.. ఓవర్‌లోడ్ వల్లనే ప్రమాదం జరిగినట్టు వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్టు చెప్పారు. డ్రైవర్ రాజు అప్రమత్తమై బస్సును వెంటనే ఆపడం వల్ల ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అద్దె బస్సుల నిర్వహణపై వాటి యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, తరచూ తనిఖీ చేస్తూ బస్సులను ఎప్పుడూ ఫిట్‌గా ఉంచాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ గ్రామ శివారులో రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. జక్లేర్ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీ కొనగా.. కార్లు రెండూ నుజ్జునుజ్జయ్యి ఐదు గురు అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో చిన్నారి కూడా ఉంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. వారిని ఆస్పత్రికి చేర్చి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమం గా తెలుస్తోంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘట నా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు.. కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. రోడ్డు ప్రమాదానికి అతివేగమే కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. యాక్సిడెంట్ కావడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వగా.. పోలీసులు క్లియర్ చేస్తున్నారు.

యువత సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగాలి

- ఆర్‌టిసి ఎమేడి సజ్జనార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి యువత ఏ రంగంలోనైనా రాణించడానికి అనేక సవాళ్లను ఎదుర్కోవాలని, అప్పుడే అత్యున్నత స్థానంలో ఉంటామని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ అన్నారు. యువత సమాజం, దేశం కోసం పనిచేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఐసిబిఎం 16వ స్నాతకోత్సవానికి సజ్జనార్ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా 2021-2023 సంవత్సరానికి సంబంధించి 150 మంది విద్యార్థులకు ఐసిబిఎం చైర్మన్ ప్రొఫెసర్ జరార్‌తో కలిసి సజ్జనార్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. 34 ఏండ్లుగా కాలేజీని విజయవంతంగా కొనసాగిస్తున్న చైర్మన్ ప్రొఫెసర్ జరార్, రీతు జరార్, జితేందర్‌ను అభినందించారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని తెలిపారు. ఈ కాలేజీలో చదివిన ప్రతి విద్యార్థికీ వంద శాతం జాబ్ గ్యారెంటీతోపాటు ఎంతో మంది వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తాను ఆర్‌టిసి ఎండిగా బాధ్యతలు చేపట్టినప్పుడు అనేక సమస్యలు స్వాగతం పలికాయని, ఒక్కొక్క సమస్యను ఒక్కొక్క రీతిలో పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఆర్‌టిసి మొత్తం దివాళా తీసి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉంటే ఇప్పుడు వాటన్నింటినీ అధిగమించి లాభాల్లోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రజల వద్దకు ఆర్‌టిసి, గమ్యం యాప్, ఆర్‌టిసి కార్మికుల కోసం ప్రత్యేక బీమా ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకు సాగడంతో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. అదేవిధంగా ఆర్‌టిసి కార్మికులకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు ఇచ్చి ఆర్‌టిసి అభివృద్ధికి కృషి చేసినట్టు వివరించారు. ఆర్‌టిసిలోని 50 వేల మంది ఉద్యోగులకు యాప్ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సంస్థ ఆర్థిక పరిస్థితి వివరించి భవిష్యత్తులో చేయవలసిన కర్తవ్యాల గురించి వివరించినట్టు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ ద్వారా వివిధ రకాల వ్యాపారాలను కూడా ప్రారంభించి లాభాలు తీసుకొచ్చామన్నారు. నిత్యం విద్యార్థులు పుస్తకాలు బాగా చదవాలని సూచించారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పుడు నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. అనంతరం చైర్మెన్ ప్రొఫెసర్ జరార్ మాట్లాడుతూ.. ఐసిబిఎం కాలేజీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. తమ కాలేజీలో మొదట క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తద్వారా భవిష్యత్తులో విద్యార్థులు ఆ రంగాల్లో రాణించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో చదివిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉద్యోగం లభిస్తుందని స్పష్టం చేశారు. తమ కాలేజీలో చదవడానికి ఇతర రాష్ట్ర విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ కిరణ్ నేటి, సుమన్ సుగుణ, సురేష్, డైరెక్టర్లు రీతు జరార్, జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి నిర్వీర్యం

- 25 ఏళ్లుగా ఏలిన గుర్తింపు సంఘాల వైఫల్య ఫలితం
- 1.16 లక్షల నుంచి 39 వేలకు పడిపోయిన కార్మికుల సంఖ్య
- ఖజానా ఖాళీ చేసిన కెసిఆర్ నిర్వీర్యం చేసే పనిలో మోడీ
- సంస్థను పరిరక్షించుకోవలసిన బాధ్యత కార్మికులదే..
- సిఐటియు గెలిస్తే కార్మికులు గెలిచినట్టే
- 27న ఎన్నికలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

135 సంవత్సరాల చరిత్ర గల సింగరేణిని బొందల గడ్డగా మార్చిన ఘనత గుర్తింపు సంఘాలుగా ఉన్న ఎఐటియుసి-ఐఎన్‌టియుసి, టిబిజికెఎస్‌లకే దక్కింది. 1998లో తొలిసారిగా సింగరేణిలో ఎన్నికలు జరిగాయి. ఆనాటి నుంచి ఎఐటియుసి మూడు సార్లు, ఐఎన్‌టియుసి ఒక్కసారి గెలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిన అనంతరం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘం టిబిజికెఎస్ 2012, 2017లో గెలుపొందింది.

బొగ్గు బ్లాకులను కాంట్రాక్టీకరణ చేసిన ప్రధాని మోడీ..!

1998 నుంచి 3 సార్లు దాదాపు పుష్కరకాలం సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఎఐటియుసి సంస్కరణలపై పోరాట బాట వదిలి పైరవీలు చేసుకుంటూ యాజమాన్యం తొత్తు సంఘంగా మిగిలింది. కార్మికులకు, సంఘాలకు వ్యతిరేకంగా సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన సంస్కరణలకు తలూపింది. పైకి మాత్రం వ్యతిరేక పోరా టం అంటూ హల్‌చల్ చేసినా.. కోడ్ ఆఫ్ డిసిప్లేన్, ఓసీల ఏర్పాటు, వారసత్వ తొలగింపు, ప్రయివేటీకరణ ప్రవేశపెట్టినా నోరెత్తలేదు. కోడాఫ్ డిసిప్లేన్ వల్ల గుర్తింపు సంఘం తప్ప మిగతా సంఘాలకు యాజమాన్యంతో మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. బొగ్గు బావులపై మీటింగ్‌లకు గుర్తింపు సంఘానికే అవకాశం ఉండేటట్టు చేశారు. కార్మికుల హక్కులు కాలరాశారు. దాంతో ఆ సంఘానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. గుర్తింపు సంఘం సూచించిన వారికే సింగరేణిలో ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, క్వార్టర్స్, కోరుకున్న చోట బదిలీలు, తేలికపాటి పనులు తదితర అవకాశాలు కల్పించారు. వ్యతిరేకించిన కార్మిక సంఘాల నాయకులను ఇబ్బందులకు గురిచేశారు. కఠినమైన పనులకు పంపారు. సమస్యలపై కార్మికులు గుర్తింపు సంఘం దగ్గరికి వెళితే తమ సంఘంలో చేరితేనే సమస్య పరిష్కరింపజేస్తామని తేల్చిచెప్పేవారు. ఆ విధంగా కార్మికులను లోబరుచుకున్నారు. మాట వినని కార్మికులను తేలికపాటి పనుల నుంచి కఠినమైన పనిలో వేయడం, జనరల్ షిఫ్ట్ అయితే మూడు షిఫ్టుల్లోకి మార్చడం చివరికి ఆదిలాబాద్ జిల్లా గోలేటి మైన్‌కు బదిలీ చేయడం కార్మికులు చవిచూశారు. ఇదే బాటలో ఐఎన్‌టియుసి నడిచింది. టిబిజికెఎస్ గెలిచిన అనంతరం ఒకడుగు ముందుకు వేసిన మాజీ సిఎం కెసిఆర్ సింగరేణిని తన గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ జోక్యానికి తెరలేపారు. రూ.29 వేల కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్న సింగరేణి ఖజానా ఖాళీ చేసి నిర్వీర్యం చేశారు. ప్రధాని మోడీ.. కోల్ ఇండియాలో161 బొగ్గు బ్లాకులు, తెలంగాణలో 2 గనులను ప్రయివేటీకరణ చేశారు. గుర్తింపు సంఘాలేమో చోద్యం చూస్తూ గడిపేశాయి.

సింగరేణిలో సంస్కరణలతో దిగజారిన కార్మికులు, బావుల సంఖ్య

సింగరేణిలో గుర్తింపు సంఘాలు యాజమాన్యానికి బాసటగా నిలవడంతో సంస్కరణల బాట పుంజుకొంది. ఖమ్మం, వరంగల్, కరీంనగ్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 56 భూగర్భ బావులు ఉండగా నేడు 22కు పడిపోయాయి. ఓసీల సంఖ్య 18కి చేరింది. 1.16 లక్షల మంది ఉన్న కార్మికులు నేడు 39 వేలకు పడిపోయారు. యాంత్రీకరణతో పాటుగా బొగ్గు ఉత్పత్తి పెరిగింది. భూగర్భ గనుల స్థానంలో ఓసీల సంఖ్య పెరుగుతోంది. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 25 వేలకు చేరింది. సింగరేణి కార్మికులకు మినిమం రూ.28 వేల వేతనం కాగా కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.8 వేలు మాత్రమే. వారు శ్రమ దోపిడీకి గురౌతున్నారు. బొగ్గు గనులున్న పట్టణాలు నిర్వీర్యం అవుతున్నాయి. దీనికి నిదర్శనం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు. బ్రిటీష్ కాలంలో 1889లో బొగ్గుట్టగా పేరొందిన పట్టణం నేడు బొందల గడ్డగా మారింది. ఇక్కడ ఇండ్లకు, స్థలాలకు విలువ లేకుండా పోయింది. రాబోయే కాలంలో కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, భూపాలపల్లి, గోదావరి ఖని, తదితర పట్టణాల గతీ ఇంతే కానుంది. దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ లక్షలాది మంది ప్రజలు ఉపాధి కోల్పోయారు. దీనికి కారణం ఆనాటి గుర్తింపు సంఘాలేనని కార్మికులంటున్నారు.

నిశ్శబ్ద యుద్ధం ద్వారా సిఐటియును గెలిపించండి

డిసెంబర్ 27న సింగరేణి వ్యాప్తంగా బొగ్గు గనుల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. 'నిశ్శబ్ద యుద్ధం ద్వారా సిఐటియును గెలిపించండి.. ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు చేయండి.. అంటూ ఆ సంఘం నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బిఎస్ఎన్ఎల్‌లో 25 ఏండ్లుగా సిఐటియు గుర్తింపు సంఘంగా ఉంది. రామగడం ఎన్‌టిపిఎస్, హైదరాబాద్‌లోని బిహెచ్ఇఎల్, మహేంద్ర అండ్ మహేంద్ర, ఐడిపిఎల్, బిడిఎల్, ఇసిఎల్ఎల్, రెడ్డి ల్యాబ్, అరవింద్ ల్యాబ్, ఎంఆర్ఎఫ్ టైర్స్, విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌లో సిఐటియునే కార్మికులు గెలిపించారు. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని పరిశ్రమల్లో ఇటీవల ఎన్నికలు జరిగితే స్వయంగా రాష్ట్ర మంత్రులు ప్రచారం చేసి పోటీలో పాల్గొన్నా వారిని కార్మికులు చిత్తుగా ఓడించి సిఐటియు నాయకులను గెలుపించుకున్నారు. కార్మికుల తరుపున సిఐటియు నికరంగా, నిజాయితీగా నిలబడడం వల్లే కార్మికులు ఆదరిస్తున్నారు. సిఐటియు అంటే సింగరేణి కార్మికులకు కూడా నమ్మకం ఉంది. నీతి, నిజాయితీ, నిజాలే చెబుతారని మైన్స్‌పై ఎందరో కార్మికులు అంటుంటారు. ఆ నమ్మకం ఓటుగా మారాల్సిన అవసరం ఉంది.

సిరిసిల్ల రైలుమార్గం పనుల్లో జాప్యం

- భూసేకరణలో అడ్డంకులు
- నేతలు దృష్టిపెడితే రైలు కూతకు మోక్షం
- కొత్తపల్లి-మనోహరాబాద్ మార్గంపై జిల్లా వాసుల ఆశలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వస్త్రోత్పత్తి రంగంలో రెండో సోలాపూర్‌గా పేరొంది.. జిల్లా కేంద్రంగా అభివృద్ధి పథంవైపు పయనిస్తున్న సిరిసిల్లతోపాటు దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం ఉన్న వేములవాడకు రైలు మార్గం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు రైలు కూత కోసం ఎదురుచూస్తున్నారు. కొత్తపల్లి -మనోహరాబాద్ మార్గం పూర్తయితే రైలు కూత వినపడనుంది. పనులు సాధ్యమైనంత తొందరగా చేయాలని అధికారులు భావిస్తున్నప్పటికీ భూసేకరణలో అడ్డంకులు జాప్యానికి కారణమవుతున్నాయి. దీనిపై నేతలు దృష్టి పెట్టాల్సిన అవసరముంది.

దశాబ్ద కాలం నుంచి ఎదురు చూపులే..

రాజన్నసిరిసిల్ల జిల్లాను కలుపుతూ 151.36 కిలోమీటర్ల పొడవున కొత్తపల్లి -మనోహరాబాద్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం నుంచి ప్రతిపాదన ఉన్నప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. ఈ రైలు మార్గాన్ని రూ.1160.47కోట్ల అంచనాతో 2020-21నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ మార్గానికి కేంద్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ రైలు మార్గానికి అవసరమైన భూసేకరణ, దానికి అయ్యే వ్యయం అంతా భరించాలని రైల్వే శాఖ గత రాష్ట్ర ప్రభుత్వానికి షరతు విధించడంతోపాటు నిర్మాణ పనుల్లో మూడోవంతు భరించాలని నిబంధన పెట్టింది. కేంద్రం షరతులకు గత ప్రభుత్వం అంగీకరించడంతో రైలు మార్గం సర్వే పనులు మొదలుపెట్టారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో రైలు మార్గం సర్వే పనులు పూర్తికాగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూ యజమానుల అడ్డంకులతో సర్వే పనుల్లో జాప్యం జరిగింది. జిల్లాలో 17 రెవెన్యూ గ్రామాల్లో దాదాపు 950 ఎకరాల వరకు రైల్వే లైన్ నిర్మాణం కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. ఇందులో 12 గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. జిల్లాలో దాదాపు 60కిలోమీటర్ల పొడవు రైలు మార్గం రానుంది. విస్తీర్ణపరంగా జిల్లాలో 950ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. అధికారులు సర్వే చేసినా సమస్యను ఆయా ప్రాంతాల రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుంది. వేములవాడ సిరిసిల్ల ప్రాంతాల్లో కొన్నిచోట్ల సర్వే పనులను భూయజమానులు అడ్డుకోవడంతో అధికారులు నిలిపివేశారు. ఈ ప్రాంతాల్లో భూములు కోల్పోయే రైతులతో రెవెన్యూ యంత్రాంగం మాట్లాడి సమస్య పరిష్కరిస్తే సర్వే పనుల్లో వేగం పుంజుకుంటుంది. రైలు మార్గం పూర్తయితే మెదక్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలతోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన సిరిసిల్ల నుంచి వస్త్ర ఉత్పత్తి ఎగుమతులు, దిగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంది. పరోక్షంగా కార్మికులకు లాభం కలగనుంది. హైదరాబాదుకు రాకపోకలు పెరిగి వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందడానికి దోహదపడనుంది.



50శాతం మాత్రమే రైల్వే లైన్ నిర్మాణం కోసం భూ సర్వే పూర్తయిందని తెలుస్తోంది.

అడ్డంకులు తొలగితేనే పనుల్లో వేగం

రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న అడ్డంకులు తొలగితేనే పనుల్లో వేగం పెరగనుంది. భూసేకరణ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించాల్సి ఉంది. సిరిసిల్ల జిల్లాలో